# ఇరాక్‌పై అమెరికా దాడిని తేటతెల్లం చేసిన హాస్యభరిత సంగీత నాటకం 'బాగ్దాదీ'

**14 సం॥** క్రితం 1.3.2003న అమెరికా నాయకత్వాన సాయుధ బలగాలు ఇరాక్‌పై దాడిచేసి ఆక్రమించాయి. అవి ఇరాక్ ప్రజలపై అన్నిరకాల దుర్మార్గాలకు, నేరాలకు, సామూహిక హత్యాకాండకు పాల్పడ్డాయి. ఇరాక్ దేశ సంపదను, ప్రజల ఆస్తులను విధ్వంసం గావించాయి. ఇరాక్ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్‌ను అవి అత్యంత పాశవికంగా చంపేసి, తమ కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. దీనికి ముందు సామ్రాజ్యవాదులు సద్దాం హుస్సేన్‌ను ఒక నరరూప రాక్షసుడుగా చిత్రించే ప్రయత్నాలన్నీ చేశారు. వినాశకరమైన జీవమారణాయుధాలు ఇరాక్ వద్ద ఉన్నాయని, సద్దాం ఎప్పుడు తలచుకుంటే అప్పుడు వాటిని ప్రపంచం మీద ప్రయోగించవచ్చని ఒక కట్టుకథ అల్లటానికి అమెరికా ఇంటలిజెన్స్ వర్గాలు అహరహం శ్రమించాయి. దీనిని సాకుగా చూపెట్టి అమెరికా నాయకత్వాన సాయుధ సైన్యం ఇరాక్‌లోకి చొరబడింది. ఈ యుద్ధంలో 1,73,916 మంది సాధారణ ఇరాకీ ప్రజలు మరణించి ఉంటారని భావిస్తున్నారు.

వాస్తవాలు వెలుగులోకి రావటానికి ఎంతో సమయం పట్టలేదు. ఇరాక్‌లోకి చొరబడటానికి, దానిని సమర్థించుకోవటానికి అమెరికా చెప్పిన కారణం - వారి నిఘావర్గాలచే అల్లబడిన కట్టుకథ అని నిర్ధారణ అయింది. ఆ తర్వాత ప్రపంచ పటంపై విశేష ప్రాముఖ్యం గల అనేక పరిణామాలు చోటుచేసుకున్నాయి.

2017 ఏప్రిల్ 6న న్యూయార్క్‌లో 'బాగ్దాదీ' అనే మ్యూజికల్ కామెడీ షో ప్రదర్శితమైంది. ఛార్లీ ఫింక్ దీని రూపకర్త. కాకతాళీయంగా అదేరోజు, గగనతలం నుండి సిరియాపై క్షిపణి దాడి జరపటానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆదేశాలిచ్చాడు.

ఈ ప్రదర్శనకు కేంద్ర బిందువు ఇరాక్‌పై అమెరికా సాగించిన దురాక్రమణ యుద్ధం. సద్దాంహుస్సేన్ అధ్యక్షుడుగా ఉన్నప్పుడు ఇరాక్‌లో జీవమారణాయుధాలు ఉన్నాయన్నది ఇరాక్‌పై దాడిని సమర్థించుకోవటానికి అమెరికా నిఘావర్గాలు అల్లిన కట్టుకథ అని ఈ ప్రదర్శన స్పష్టం చేసింది.

ఈ నాటకకర్త మాట్లాడుతూ సిరియాపై, కాకపోతే ఉత్తర కొరియాపై దాడి చేయటానికి కాలుదువ్వుతూ దేశాన్ని ట్రంప్ మరో వివాదంలోకి లాగుతున్నాడని అన్నారు. కొందరు భయపడుతున్న పరిస్థితుల్లో, అబద్ధపు వార్తలు, ప్రత్యామ్నాయ కారణాలు షికారు చేస్తున్న నేపథ్యంలో, 14 సంవత్సరాల క్రితం అమెరికా పాలకులు ఇరాక్‌లో సాగించిన దురాగతాన్ని ఇప్పుడు వెల్లడిచేయటం సందర్భోచితంగా ఉందన్నారు. 2003లో జరిగిన అతిపెద్ద దురాక్రమణ దాడికి బాధ్యత ఆనాటి అమెరికా అధ్యక్షుడు జార్జి డబ్ల్యు. బుష్‌ది, అమెరికా ప్రభుత్వానిది మాత్రమేకాక యావద్దేశానిది, వారి పశ్చిమ దేశాల మిత్రకూటమిది అనే సందేశాన్నిచ్చింది ఈ నాటకం. ఈ నాటకానికి దర్శకుడు, సహరచయిత అయిన మార్షల్ పిల్లెటో మాట్లాడుతూ వాస్తవాలు తెలియనీయకుండా తామందరినీ గందరగోళంలో పడేశారని అన్నాడు.

న్యూయార్క్‌లో ప్రదర్శింపబడిన ఈ నాటకం ప్రేక్షకుల ఆలోచనలపై ప్రభావం చూపిందని, వారికి ఈ విషయం చేరువకావటం కోసం వస్తువు, శిల్పం, స్వభావం, గుణపాఠం అన్నింటినీ హాస్యంతో మేళవించా మన్నారు. నాటక కర్త ఫింక్ మాట్లాడుతూ ప్రపంచానికి తగిలిన ఈ గాయం, కన్నీళ్ళతోనో, హాస్యంతోనో నయమయ్యేది కాదని, తామంతా దీనికి బాధ్యత వహిస్తున్నామన్నారు.

అమెరికా ప్రజలకు తమ సామ్రాజ్యవాద పాలకుల దురాక్రమణ చర్యలకు వ్యతిరేకంగా దృఢంగా గొంతెత్తే చరిత్ర ఉంది. వియత్నాంపై, ఇరాక్‌పై, ఆఫ్ఘనిస్తాన్‌పై ఇంకా అనేక ఇతర దేశాలపై అమెరికా దాడి చేసిన సందర్భాలలో వారు అమెరికా పాలకుల తీరును ఎండగట్టారు. దాడులకు వ్యతిరేకంగా పోరాడేవారికి, శాంతిని కాంక్షించేవారికి వారెల్లప్పుడూ మద్దతుగా నిలిచారు. ఇప్పుడు 'బాగ్దాదీ' నాటక నిర్మాతలు, రచయితలు, కూర్పరులు, నటులు, సాంకేతిక సిబ్బంది ఈ రాజకీయ నేపథ్యమున్న నాటకాన్ని ప్రదర్శించటం ద్వారా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడేవారికి తమ మద్దతు తెలిపారు.

ooooo